క్లుప్తంగా

పెన్షనర్లకు ఫారం-16 జారీ

అమలాపురం టౌన్: గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం నుంచి ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు పొందిన స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్లకు ఫారం –16 జారీ చేసినట్లు అమలాపురం సబ్ ట్రెజరీ అధికారి రంగారావు తెలిపారు. ఇదే సమాచారాన్ని ఆయన జిల్లా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు తెలియజేశారు. ఇలా ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు పొందిన పెన్షనర్లు ట్రెజరీ కార్యాలయం పనివేళల్లో ఫారం –16ను తీసుకోవచ్చని పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు సూచించారు.

ఇంటి వద్దకే రేషన్ నిలిపివేయడం ఓర్వలేనితనమే

అమలాపురం టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజా రంజకంగా ప్రారంభించిన ఇంటి వద్దకే రేషన్ సరకుల పంపిణీ విధానాన్ని ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిలిపివేయడం ఓర్వలేని తనమేనని పార్టీ జిల్లా ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలు రేషన్ షాపుల వద్ద గంటల తరబడి బారులు తీరి నిరీక్షించే దుస్థితికి చరమ గీతం పాడి ఇంటింటికీ రేషన్‌ను అందించే వాహనం (ఎండీయూ) వ్యవస్థను గత ప్రభుత్వం అందబాటులోకి తెచ్చిందని గుర్తు చేశారు. ప్రజాదారణ పొందిన ఈ విధానాన్ని చూసి ఓర్వలేకే కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఎండియూ వ్యవస్థను రద్దు చేసిందన్నారు. ఇప్పటికే ప్రజాదారణ పొందిన ఈ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలని కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

నాన్ నీట్ కోర్సులకు 5,247 దరఖాస్తులు

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా నాన్ నీట్ కోర్సులైన వొకేషనల్, ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కోర్సులకు 5,247 దరఖాస్తులు వచ్చాయని గురువారం సెంటాక్ ప్రకటనలో తెలిపింది. నాన్‌నీట్ కోర్సులకు యానాం, మాహే, కారైకల్,పుదుచ్చేరి రీజియన్ విద్యార్థులు సెంటాక్ ద్వారా దరఖాస్తు చేసుకుంటారు. ఇప్పటికే 7,664 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని అయితే 5,247 మంది తమ దరఖాస్తులను పూర్తిస్థాయిలో అప్‌లోడ్ చేశారన్నారు. 2,693 మంది ఆర్ట్స్ కోర్సులకు, 1,885 మంది మైక్రోబయాలజీ, 1,603 మంది ఫార్మసీ, 2,612 మంది బీటెక్, 872 మంది అగ్రికల్చర్, 489 మంది లా, 471 మంది డిప్లమా, 293 మంది డీఎస్ఎమ్, 376 మంది వెటర్నరీ(అరోవల్లి) కోర్సులకు దరఖాస్తు చేశారని తెలిపారు.

25న స్మారక స్థూపం ఆవిష్కరణ

తాళ్లరేవు: మండల పరిధిలో నీలపల్లి గ్రామ తొలితరం కమ్యూనిస్టు పార్టీ నాయకుల పేర ఏర్పాటు చేసిన స్మారక స్థూపాన్ని ఈ నెల 25న సీపీఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు ఆవిష్కరిస్తారని ముఖ్యఅతిథిగా డాక్టర్ చలం హాజరవుతారని పార్టీ మండల కమిటీ గురువారం ప్రకటనలో తెలిపింది. దివంగతులు కమిడి వెంకటనారాయణ, మాత వేమనాచార్యులు, దడాల మహాలక్ష్మి, మేడిశెట్టి నీలాద్రి, కమిడి సుధాకర్ పేర స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

యానాం: పుదుచ్చేరి సెంట్రల్‌యూనివర్శిటీ అనుబంధ సంస్థ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, యానాం లో 2025–26 విద్యాసంవత్సరానికి పోస్టు గ్రాడ్యుయేషన్(పిజి)అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ(కెమిస్ట్రీ)18, ఎంఎస్సీ జువాలజీ–20సీట్లు, ఎంఎ ఎకనామిక్స్–20సీట్లు, ఎంకామ్ జనరల్–20సీట్లు ఉన్నాయన్నారు. డిగ్రీ, తత్సమాన పరీక్షల్లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు పీజీ అడ్మిషన్లకు అర్హులన్నారు. దరఖాస్తులను ఈనెల 26 నుంచి కళాశాలలో పంపిణీ చేస్తారని తిరిగి వాటిని పూర్తిచేసి జూన్ 6లోగా అందించాలన్నారు. రెండేళ్లకు కలిసి ఫీజు కేవలం రూ.5వేలు మాత్రమేనని తెలిపారు.

ప్రభుత్వానికి ఆర్థిక సమస్యలు



మినీ మహానాడులో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. అమలాపురంలోని కాపు కల్యాణ మండపంలో గురువారం జరిగిన జిల్లా టీడీపీ మినీ మహానాడు సభలో ఆయన మాట్లాడారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం, ఈలోగా ఇప్పుడు అమలవుతున్న పథకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పార్టీ ప్యాలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిబాబు, వేగుళ్ల జోగేశ్వరరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు ప్రసంగించారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం

మున్సిపల్ కార్యాలయం సమీపంలో అన్నా క్యాంటీన్‌ను మంత్రి అచ్చెన్నాయుడు గురువారం ప్రారంభించారు.

నాణ్యత లోపం.. జనానికి శాపం

- కుంగిపోతున్న రక్షణ గట్టు
- భారీ వాహనాల రాకపోకలే కారణం
- ఏమాత్రం పట్టించుకోని అధికారులు
- ప్రమాదాల బారిన వాహన చోదకులు



కుండలేశ్వరం వద్ద పంటకాలువ వైపు దిగబడిన గోదావరి రక్షణ గట్టు

కాట్రేనికోన: ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని కాట్రేనికోన, ముమ్మిడివరం మండల ప్రజలకు గోదావరి వరదల నుంచి రక్షణగా నిలుస్తున్న రక్షణ గట్టు కుండలేశ్వరం వద్ద పంట కాలువ వైపు దిగజారి కుంగిపోతోంది. అన్నంపల్లి నుంచి బలుసుతిప్ప వెళ్లే టైడల్ బ్యాంకు రక్షణ గట్టు కుండలేశ్వరం వద్ద క్షీణించింది. మురమళ్ళ నుంచి పల్లంకుర్రు వెళ్లేందుకు బీటీ రోడ్డు వేయడం, దగ్గర దారి కావడంతో వాహనదారులతో పాటు భారీ వాహనాలు సైతం ఈ దారిలో రాకపోకలు సాగిస్తున్నాయి. కుండలేశ్వరం లాకు వద్ద పుష్కర ఘాట్ సమీపంలో రక్షణ గట్టు పనులలో నాణ్యత లేక గట్టు దిగబడింది.

వికటించిన తడక వైద్యం

గత ఏడాది బీటలు వారి పంటకాలువ వైపు జారుతున్న గట్టుకు హెడ్ వర్క్స్ అధికారులు మొక్కుబడిగా సరుగుడు కర్రలు, వెదురు తడకలు పంటకాలువ వైపు కట్టి మట్టి వేసి వదిలేశారు. రక్షణ గట్టుకు అధికారులు చేసిన తడక వైద్యం వర్షాలు పడటంతో వికటించి మరింత కుంగిపోయింది. శానపల్లిలంక వద్ద పడిన గండితో వరద నీరు కోనసీమను ముంచెత్తిన ఘటనను గుర్తు చేసుకుంటున్నారు. 'సాక్షి' కథనంతో స్పందించిన కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పరిశీలించారు. కుండలేశ్వరం వద్ద ఏటిగట్టుపై బీటలు వారి దిగబడుతున్న ప్రాంతంలో గ్రావెల్ వేసి తాత్కాలిక పనులు తక్షణమే చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గట్టు బలహీనంగా ఉన్నచోట రివిట్‌మెంట్ వాల్ శాశ్వతంగా నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హెడ్ వర్క్స్ అధికారులు మొక్కుబడిగా పనులు చేపట్టడంతో సుమారు 150 మీటర్ల మేర పంటకాలువ వైపు గట్టు జారిపోయింది. ఈ ప్రాంతంలో వాహనదారులు అనేకమంది ప్రమాదాలకు గురి అవుతున్నారు. మురమళ్ళ వద్ద బారికేడ్ ఏర్పాటు చేసినా పక్కకు తీసివేసి రొయ్యలు ఫ్యాక్టరీలకు చెందిన వాహనాలు, ఇసుక టిప్పర్లు అధిక బరువులుతో రాకపోకలు సాగిస్తున్నాయి.

ఆక్వా రైతుల కన్నాలు

పసువుల్లంక, కొమరగిరి, మురమళ్ళ, ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.మూలపొలం, కేశనకుర్రు, అన్నంపల్లి, పల్లంకుర్రు, నడవపల్లి తదితర ప్రాంతాలలో పంటకాలువ నీటిని చెరువులకు తోడేందుకు ఆక్వా రైతులు కన్నాలు పెట్టి పైపులు పెడుతున్నారు. దీంతో గోదావరికి వరదలు వస్తే ఐ.పోలవరం, కాట్రేనికోన మండల ప్రజలకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయం ఇరిగేషన్, హెడ్ వర్క్స్ అధికారులకు తెలిసినా కాసులకు కక్కుర్తిపడి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రహదారిపై వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

పొంచి ఉన్న వరద ముప్పు

రక్షణ గట్టు కుండలేశ్వరం వద్ద అధిక మొత్తంలో దిగబడటం, బూలవారి మొండి ప్రాంతాలలో బలహీనంగా ఉండటం వల్ల వరదలు వస్తే నదీ పరివాహక లోతట్టు ప్రాంతాలను ముంచెత్తే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ముంబయిలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరదలు వచ్చే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అంచనాలు ఉన్నతాధికారులకు పంపించాం

కుండలేశ్వరం వద్ద రక్షణ గట్టు దిగబడుతున్న విషయం జిల్లా కలెక్టరు దృష్టిలో ఉంది. పనులకు సంబంధించి అంచనాలు వేసి ఉన్నతాధికారులకు పంపించాం. మంజూరైన తక్షణమే పనులు చేపడతాం.

– ఈశ్వర మణ్యం, హెడ్‌వర్క్స్ ఏఈఈ

వైఎస్సార్ సీపీ నాయకుడికి డాక్టర్ శ్రీకాంత్ పరామర్శ



పార్టీ నాయకుడు విద్యాసాగర్‌ను పరామర్శిస్తున్న పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉప్పలగుప్తం వైఎస్సార్ సీపీ నాయకుడు చేట్ల విద్యాసాగర్‌ను పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ గురువారం పరామర్శించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి విద్యాసాగర్ ఆరోగ్య వివరాలను డాక్టర్ శ్రీకాంత్ తెలుసుకున్నారు.

జాబ్‌మేళా రేపు

అమలాపురం రూరల్: జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్, ఎస్ఈఈడీఏపీ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రయివేట్ కంపెనీలలో పనిచేయడానికి శనివారం ఉదయం 10.30 గంటల నుంచి ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పనాధికారి వసంత లక్ష్మి గురువారం ప్రకటనలో తెలిపారు. వివరాలకు 94916 81050, 82476 45389, నంబర్లలో సంప్రదించాలన్నారు.

లెక్క చెబితేనే సంతకం పెడతాం

- ఎంపీడీవోపై ధ్వజమెత్తిన సభ్యులు
- కాట్రేనికోన మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యవతి

కాట్రేనికోన: గత మూడున్నరేళ్లుగా మండల పరిషత్‌కు మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, ప్రస్తుతం ఉన్న నిధులకు లెక్కలు చెబితేనే మినిట్ బుక్‌లో సంతకం పెట్టి సర్వసభ్య సమావేశానికి హాజరవుతామని, లేదంటే వాకౌట్ చేస్తామని ఎంపీటీసీ సభ్యులు మోకా చంద్రనాగరత్నం, సంగాని మునేంద్రవర్మ, ర్యాలి వీరబాబు ఎంపీడీఓపై ధ్వజమెత్తారు. కాట్రేనికోన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ కోలాటి సత్యవతి అధ్యక్షతన జరిగింది. ముందుగా ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో గ్రామాభివృద్ధికి సమన్వయంతో పని చేద్దామన్నారు. సభ్యులు మండల పరిషత్ నిధులపై లేవనెత్తిన ప్రశ్నకు ఎంపీడీఓ మాట్లాడుతూ చేపట్టిన పనుల ప్రతులు సభ్యులకు అందచేస్తామన్నారు. కందికుప్ప పంటకాలువ పూడికతీత పనుల్లో నాణ్యత లేదని ఎంపీటీసీ గుణవీణకుమార్ ఆరోపించారు. ఉపాధి హామీ పనులు వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో చేపట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సభ్యులు మోకా చంద్రనాగరత్నం, సర్పంచ్ నాతి అలివేణి అన్నారు. పేదలకు రక్షిత మంచి నీటిని అందించేందుకు చేపట్టిన జలజీవన్ మిషన్ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు ఆరోపించారు. పల్లం సర్పంచి మల్లాడి వీరబాబ్జి మాట్లాడుతూ పంచాయతీ స్థలం పల్లంలో కబ్జాకు గురైందని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తహసీల్దార్ సునీల్‌ను నిలదీశారు. ఉప్పూడి సర్పంచ్ రంబాల రమేష్ మాట్లాడుతూ తమ గ్రామంలో లైన్‌మేన్ లేరని, లోవోల్టేజి సమస్యపై విద్యుత్ శాఖ అధికారులను నిలదీశారు. జెడ్పీటీసీ నేల కిషోర్, ఎంపీడిఓ వెంకటాచలం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌ను కలిసిన రైతులు

ఫ్రెంచి కెనాల్‌లో పూడిక తీయించాలని వినతి



ఎమ్మెల్యే అశోక్‌ను కలిసిన దరియాలతిప్ప రైతులు

యానాం: దరియాలతిప్ప ఆయకట్టు పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆ ప్రాంత రైతులు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను కోరారు. వారు మాట్లాడుతూ తాగు,సాగునీటి అవసరాల కోసం గతంలో ఏర్పాటు చేసిన పత్తిగొంది నుంచి దరియాలతిప్ప వరకు ఉన్న ఫ్రెంచి చానల్ ప్రస్తుతం పూర్తిగా గడ్డి, పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో నిండిపోయిందని తెలిపారు. దీంతో దరియాలతిప్ప రక్షిత మంచినీటి చెరువుకు వెళ్లే ఈ నీరును శుభ్రం చేయకుండానే తాగునీటిగా సరఫరా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. తక్షణం కాలువలో పూడికతీయించి శుభ్రపరచాలని కోరారు. దరియాలతిప్ప ఆయకట్టుపై సుమారు 500 ఎకరాల పంటభూమి ఉందని, సాగునీరు సైతం శివారుకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్యలపై స్పందించి పత్తిగొంది నుంచి దరియాలతిప్ప, ఆర్‌ఐటీ కళాశాల వరకు కాలువను శుభ్రపరచాలని కోరారు. రైతులు తిరుకోటి భైరవమూర్తి, సబ్బతి రాంబాబు, కోరుకొండ ఆనందరావు, సబ్బతి శ్రీనివాసరావు, మట్టా రాంబాబు, కన్నిడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మూసుకుపోయిన వాసాలతిప్ప డ్రైన్



కామనగరువు వద్ద ఇసుక నిల్వ చేయడంతో ముసుకుపోయిన వాసాలతిప్ప డ్రైన్

అమలాపురం రూరల్: వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వం అమలాపురం రూరల్ మండలం కామనగరువు బైపాస్ రోడ్డు పక్కన వాసాలతిప్ప డ్రైన్‌కు ఆనుకుని ఇసుక స్టాక్ యార్డ్ ఏర్పాటు చేశారు. లారీలతో ఇసుకు తీసుకువచ్చి స్టోర్ చేస్తున్నారు. డ్రైన్ పక్కనే భారీగా ఇసుకను నిల్వ చేయడంతో వాసాల తిప్ప డ్రైన్ మూసుకుపోయింది. గట్టు దిగబడిపోవడంతో మొత్తం డ్రైన్ కూరుకుపోయింది. దాంతో ముంపు నీరు ఎటూ కదలడం లేదని ఇప్పటికే వరి చేలల్లోని ముంపునీరు దిగే డ్రైన్ మురుకు డ్రైనేజీగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోళ్ల వ్యర్థాలు, ఆక్వా సిల్టు, ఇతర వ్యర్థాలు డ్రైన్ లోకి వదిలేయడంతో వాసాలతిప్ప డ్రైన్ దుర్గంధ భరితంగా మారింది. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించలేదు. డ్రైనేజీని కాపాడేందుకు చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లారీ అసోసియేషన్ ఎన్నికల్లో వివాదం

అమలాపురం రూరల్: అమలాపురం లారీ అసోసియేషన్ ఎన్నికల్లో వివాదం జరిగింది. ఎన్నికలు గురువారం ఈదరపల్లిలో సంఘం భవనంలో జరిగాయి. సంఘంలో 125 మంది లారీ ఓనర్సు సభ్యులు ఉన్నారు. 45 ఏళ్లుగా అధ్యక్ష కార్యదర్శులు పదవులు ఒకే వర్గానికి కేటాయిస్తున్నారని, ఈసారి కార్యదర్శి పదవి తమకు ఇవ్వాలని శెట్టిబలిజ వర్గీయులు కోరారు. అందుకు అంగీకరించకపోవడంతో తాము ఏ పదవి తీసుకోకుండా ఎన్నికకు దూరంగా ఉంటామని వారు చెప్పారు. దీంతో నూతన కార్యవర్గం ఎన్నిక ఏకపక్షంగా జరిగింది. యూనియన్ అధ్యక్షుడిగా నల్లా శ్రీరాములు, గౌరవ అధ్యక్షుడిగా కురచ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కోరసిక శ్రీనివాసరావు, కార్యదర్శిగా పోలిశెట్టి రాంబాబు ఎన్నికయ్యారు.

బురదమయంగా రహదారి



ఆదిలక్ష్మీపురంలో బురదతో అధ్వానంగా ఉన్న రహదారి

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి ఆదిలక్ష్మీపురంలో ఇటీవల కాలంలో రైతులు పంట కాలువకు తవ్వకాలు చేపట్టి ఆ మట్టిని కాలువ వెంబడి ఉన్న రహదారి పక్కన వేశారు. ఇంతలో కొద్దిపాటిగా వర్షాలు కురవడంతో రహదారంతా బురదమయంగా మారింది. దీంతో అటువైపుగా వెళ్లే ప్రయాణికులు, వాహన చోదకులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు మట్టిపై జారీ ప్రమాదాలకు గురవుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆ మట్టిని తొలగించి ప్రయాణికులకు ఉపశయనం కలిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ధ్రువపత్రాలు జారీచేస్తాం


యానాం: సెంటాక్–2025 అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సిన కుల, ఆదాయ, రెసిడెన్స్ తదితర సర్టిఫికెట్లను ఈ నెల 24, 31, జూన్ 7 వ తేదీల్లో జారీ చేస్తామని ఆయా రోజులు వర్కింగ్ డేస్ గా ఉంటాయని గురువారం యానాం డిప్యూటీ తహిశీల్దార్ ఆర్ జ్యోతివెంకటేశ్వరరావు ప్రకటనలో తెలిపారు.

అంబరాన్నంటిన హనుమాన్ శోభాయాత్ర

- వేలాది మందితో కాషాయ జెండాలతో నిర్వహణ
- ఆకట్టుకున్న హనుమాన్ భారీ విగ్రహాల ప్రదర్శన



ప్రత్యేక అలంకరణలో ముమ్మిడివరం అభయాంజనేయ స్వామి



ఎస్.కొత్తపల్లిలో ప్రత్యేక అలంకరణలో ..

అమలాపురం టౌన్: హిందూ యువతలో సనాతన ధర్మంపై మరింత అవగాహన పెంచేందుకు హనుమాన్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని విశ్వహిందూపరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ శోభాయాత్ర గురువారం సాయంత్రం అమలాపురంలో సాగింది. జై హనుమాన్ నామస్మరణతో ఆద్యంతం ర్యాలీ సాగింది. పట్టణంలోని హనుమాన్ దేవాలయాతో పాటు ర్యాలీలో హనుమాన్ ప్రతిమల ఊరేగింపులు, ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కాలేజీ రోడ్డులోని త్రిముఖ గణపతి ఆలయం వద్ద యాత్ర ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఆలయం వద్ద జరిగిన సభలో వీహెచ్‌పీ, బజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్ నేతలు మాట్లాడుతూ సనాతన ధర్మం గురించి వివరించారు. బైక్ ర్యాలీ హైస్కూలు రోడ్డు, బ్యాంక్ స్ట్రీట్, గడియారం స్తంభం సెంటరు, ఆర్టీసీ బస్ స్టేషన్, ముమ్మిడివరం గేటు సెంటరు, నల్లవంతెన రోడ్డు, ఎర్ర వంతెన రోడ్డు మీదుగా సాగింది. ర్యాలీలో పాల్గొన్న ప్రతీ ద్విచక్ర వాహనదారుడు తన వాహనానికి కాషాయ జెండా కట్టి విజయోత్సవంలో పాల్గొన్నారు. కొందరైతే తలకు కూడా కాషాయ పాగా కట్టుకుని కనిపించారు. ఎద్దుల బండిపై, ఆవు దూడతో హనుమంతుడు తరలివస్తున్నట్లుగా ర్యాలీలో భారీ విగ్రహాలతో ప్రదర్శించారు. దాదాపు 16 హనుమన్ విగ్రహాలు వివిధ రూపాల్లో ర్యాలీలో ప్రదర్శనగా ముందుకు సాగాయి. జై భారత మాత, జై హనుమాన్, జై శ్రీరామ్, జై హిందూ సమాజం అనే నినాదాలతో ర్యాలీ హోరెత్తిందింది. పరబ్రహ్మ నందగిరి మాతాజీతోపాటు వీహెచ్‌పీ, బజరంగదళ్ ప్రతినిధులు డాక్టర్ అయ్యగారి వెంకటేశ్వరరావు, రాళ్లపల్లి పాపయ్యశర్మ, కాళ్లకూరి కుమార్, శిరంగు నాయుడు, ఊటుకూరి సాంబయ్య ర్యాలీని పర్యవేక్షించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ ర్యాలీ సాగింది. ర్యాలీలో వివిధ పార్టీల నాయకులు యాళ్ల దొరబాబు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, నల్లా పవన్ కుమార్, మోకా వెంకట సుబ్బారావు, గొవ్వాల రాజేష్ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న హనుమంతుడి భారీ విగ్రహం, ప్రతిమ



ప్రత్యేక అలంకరణలో చొల్లంగి శ్రీ అభయాంజనేయస్వామివారు

వాడవాడలా ఘనంగా..

తాళ్లరేవు: హనుమజ్జయంతి వేడుకలు గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. చరిత్ర ప్రసిద్ధిగాంచిన చొల్లంగి శ్రీ అభయాంజనేయస్వామివారి ఆలయంలో అర్చకులు గండికోట సుదర్శనం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో బూరెల చక్రధర్, బూరెల వెంకట్రాజు, కనకాల చినబాబు పాల్గొన్నారు. పి.మల్లవరంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసియున్న శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో అర్చకులు ఖండవిల్లి సత్య శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో ఉంగరాల రవీంద్ర కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాళ్లరేవులోని శ్రీ దాసాంజనేయస్వామి, సుంకటరేవు, ఇంజరం, కోరంగి, పటవల, సుంకరపాలెం, జార్జీపేట గ్రామాలలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఘనంగా హనుమాన్ జయంతి

ముమ్మిడివరం: మండలంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం పోలమ్మ చెరువు వద్ద గల శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, నిర్వహించారు. పంచామృత అభిషేకాలు, మండపారాధన, కుంబ పూజ, తమలపాకు పూజ, సిందూర పూజ, శాంతి హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలో గాడిలంక, కొత్తకాలువ సెంటర్, అయినాపురం, ఠానేల్లంక, కొత్తలంక గ్రామాలలో అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. పలు ఆలయాలలో భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా హనుమాన్ జయంతి

ఉప్పలగుప్తం: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు మేడూరి వెంకట పవన్ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉప్పలగుప్తం, భట్టుపాలెం, గోకనవిల్లి, పెదగాడవిల్లి, గోపవరం గ్రామాల్లో హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు జరిపించారు.

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండల పరిధిలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. మండల పరిధిలోని యానాం– ఎదుర్లంక వారధి వద్ద ఉన్న అతి పెద్ద ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద జరిగిన వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండట పార్టీ అధ్యక్షుడు పెన్మత్స వెంకట పతిరాజుతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండల పరిధిలో కొమరగిరి, పశువుల్లంక, తిలకుప్ప, ఐ.పోలవరం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలలో జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాల వద్ద రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



అమలాపురంలో జరిగిన హనుమాన్ శోభాయాత్ర

యానాం: యానాం శివాలయం ఆవరణలో కొలువైన భక్తాంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వైభవంగా జరిగింది. అర్చకులు పెద్దింటి నరసింహా చార్యులు, వినోదాచార్యులు విశేషపూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని యానాం, పరిసరప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. నియోజవర్గపరిధి శివారు దొమ్మేటిపేట గ్రామంలో కొలువైన అభయాంజనేయస్వామి వారి ఆలయంలో గురువారం హనుమాన్‌జయంతిని పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహిం చారు. అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.